క్లుప్తంగా

5న కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 5వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఓపెన్-టు-ఆల్ జిల్లా స్థాయి శాప్ పురుషుల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు కబడ్డీ కోచ్ భూపతిరావు 9000385443 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

8న కబడ్డీ పోటీలు

కర్నూలు కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నగర శివారులోని జి.పుల్లారెడ్డి కళాశాల సమీపంలోని విజ్ఞాన పీఠంలో కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి, సురేష్ తెలిపారు. మరిన్ని వివరాలకు 96184 49289 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అమిత్‌షా సభలో వాల్మీకుల ఎస్టీ అంశాన్ని వినిపిద్దాం

కర్నూలు(అర్బన్): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొంటున్న బీజేపీ బహిరంగ సభలో వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశాన్ని వినిపించేందుకు వేల సంఖ్యలో వాల్మీకి/ బోయలు హాజరు కావాలని వాల్మీకి బోయ సేవా సంస్థ గౌరవాధ్యక్షులు డా.భవానీప్రసాద్, కుబేరస్వామి, జిల్లా అధ్యక్షులు తలారి కృష్ణనాయుడు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో కర్నూలులో జరుగుతున్న బహిరంగ సభకు అమిత్‌షా హాజరవుతున్న నేపథ్యంలో వాల్మీకులకు జరిగిన అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు బాలసంజన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక చేయూత అందిస్తా

కర్నూలు (టౌన్): ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులకు ఆర్థికంగా చేయూత అందిస్తానని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎద్దుల ప్రభాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రూ. 8 వేలు విలువ చేసే ఫుట్‌బాల్స్‌ను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత పీఈటీ విజయరావు, ఫిజికల్ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలకు సహకారం అందిస్తా

కర్నూలు (టౌన్): క్రీడలకు తన వంతు సహకారం అందిస్తానని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. మంగళవారం స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ఆయన ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు ఎల్లో, గ్రీన్, బ్లూ ,రెడ్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టీ వెంకటేశ్వర్లు, శివ పాల్గొన్నారు.

కార్బైడ్ ఫ్యాక్టరీ కార్మికులకు పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని కార్బైడ్(వీబీసీఐఎల్) ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు పూర్తిస్థాయి పరిహారంతోపాటు పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఇతర బకాయిలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పీఎఫ్ అధికారులను కలసి విన్నవించారు. కార్మికుల పెండింగ్ బకాయిలను చెల్లించిన తరువాతే కొత్త యాజమాన్యం కామినీ స్టీలు స్వాధీనం చేసుకోవాలని వీబీసీఐఎల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌గా డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

కల్లూరు ఎస్‌ఆర్‌ఓలోని జేఏ స్థానం మార్పు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం(ఎస్‌ఆర్‌ఓ)లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.షఫీ బాషా స్థానాన్ని మార్చారు. ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి స్పందించారు. అక్కడి నుంచి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసేలా ఆదేశాలు ఇచ్చారు. కాగా మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ కల్లూరు ఎస్‌ఆర్‌ఓలో దాదాపు 2 గంటలపాటు వివిధ ఫైళ్లను తనిఖీ చేశారు.

స్నూకర్ విజేతలకు అభినందన

కర్నూలు (టౌన్): స్థానిక గాంధీనగర్‌లో ఉన్న క్యూలైన్ స్నూకర్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాయలసీమ స్థాయి స్నూకర్ పోటీల్లో కర్నూలుకు చెందిన అజయ్ విజేతగా నిలిచాడు. దీంతో మొదటి స్థానం కైవసం చేసుకున్న అతడికి రూ.10 వేలు నగదు, కప్, రెండవ స్థానంలో నిలిచిన కరీమ్‌కు రూ.5 వేలు అందించారు. స్నూకర్ విజేతలను రాష్ట్ర ఒలంపిక్ సంఘం సభ్యులు రామాంజనేయులు అభినందించారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి

కర్నూలు సిటీ: కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి 25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర పరిధిలో ఖాళీగా ఉన్న 2,35,794 ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విజేంద్ర, షబ్బీర్ బాష, రంగస్వామి, శరత్‌కుమార్, థామస్, శ్రీరంగ పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి

● ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

కర్నూలు(రాజ్‌విహార్)/కర్నూలు సిటీ: మహిళాభ్యున్నతి, విద్య కోసం ఎంతో కృషి చేసిన సావిత్రి బాయి పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక వెంకటరమణ కాలనీలోని తన కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యుడు శాంతికుమార్, దిశ సభ్యులు రమేష్, నరసింహ, యాకూబ్, మాబు తదితరులు పాల్గొన్నారు. భారతీయ సంఘ సంస్కర్త, తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని రాయలసీమ యూనివర్శిటీలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వీసీ ఆచార్య అకెపోగు ఆనందరావు, రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మలు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆ స్కూల్ హెచ్‌ఎం వెంకటరెడ్డి, నైస్ కంప్యూటర్ అధినేత రాయపాటి శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు కరీముల్లాలు పాల్గొని మహిళ టీచర్లను సన్మానించారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి ప్రసాద్‌రెడ్డి, ఐక్యూ కోఆర్డినేటర్ డా.విమలరాధే, స్త్రీ సాధికారత విభాగం కన్వీనర్ అక్తర్ భాను తదితరులు పాల్గొన్నారు. కేవీఆర్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డా.పి కళావతి, అధ్యాపకులు సావిత్రి బాయికి నివాళులర్పించారు.



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(సెంట్రల్)/కర్నూలు(అర్బన్): సావిత్రి బాయిపూలే సామాజిక విప్లవకారిణి అని, ఆనాటి పరిస్థితుల్లోనే మహిళలకు విద్య అవసరమని గుర్తించిన గొప్ప సంఘ సంస్కకర్త అని ఏపీ రజక వృత్తిదారులసంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ కొనియాడారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో సావిత్రి బాయిపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మహ్మద్‌రఫీ, విజయమ్మ, గురుస్వామి, రమణ, కృష్ణ పాల్గొన్నారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో పూలే దంపతుల విగ్రహాలకు పెద్ద సంఖ్యలో బీసీ సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వై.నాగేశ్వరరావుయాదవ్, ఎం.రాంబాబు, మురళీమోహన్, కే రామక్రిష్ణ, శకుంతల, పట్నం రాజేశ్వరి, పార్వతమ్మ, మోహన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సావిత్రి బాయి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



ఆర్‌యూలో నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య అకెపోగు ఆనందరావు, రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మ



సావిత్రిబాయి జయంతి వేడుకల్లో రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుశేఖర్ తదితరులు

వాక్ ఇన్ ఇంటర్వ్యూకు స్పందన

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టుల భర్తీకి మంగళవారం నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు భారీ స్పందన లభించింది. ఇందులో భాగంగా అభ్యర్థుల నుంచి కార్యాలయ సిబ్బంది దరఖాస్తులు స్వీకరించి సర్టిఫికెట్లు పరిశీలించారు. 9 స్టాఫ్‌నర్సు పోస్టులకు 202 మంది, రెండు ఫార్మాసిస్టు పోస్టులకు 33 మంది, ఐదు ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులకు 110 మంది, ఒక లాస్ట్ గ్రేడ్ సర్వీస్ పోస్టుకు 16 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అంధులు సమాజానికి స్ఫూర్తి నివ్వాలి

కర్నూలు(టౌన్): అంధులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి సమాజానికి స్ఫూర్తి నివ్వాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు విజయ, ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ సంయుక్తంగా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బి.క్యాంపులోని జాతీయ అంధుల సమాఖ్య శిక్షణా కేంద్ర ప్రాంగణంలో అంధుల క్రీడా పోటీలు నిర్వహించారు. అంధులకు షాట్ పుట్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చెయిర్, బ్రెయిలీ రీడింగ్, రైటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని బహుమతులు అందజేస్తామని అతిథులు వెల్లడించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు అనిల్‌కుమార్, విశ్వనాథరెడ్డి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

థెరిసమ్మ సేవలు మరువలేనివి



థెరిసమ్మ సంస్మరణ సభలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

కర్నూలు సిటీ: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా.ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ చెరుకూరి థెరిసమ్మ గత నెల 26న మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ ఆవరణలో థెరిసమ్మ సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. జార్జ్ విద్యా సంస్థల కార్యదర్శి, ఫార్మసీ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రితో పాటు, జిల్లా కలెక్టర్ పి.కొటేశ్వరరావు, ఎమ్మెల్యేలు ఎం.ఏ హఫీజ్‌ఖాన్, ఆర్థర్, చెన్నకేశవరెడ్డి, ఆర్‌యూ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలు పాల్గొని థెరిసమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు ప్రసంగించారు. ఓ సాధారణ టీచర్‌గా వృత్తిని ప్రారంభించిన థెరిసమ్మ తన పిల్లలతో పాటు, అందరు చదువుకోవాలనే ఉన్నత లక్ష్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. ఈ విద్యా సంస్థల్లో ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకొని పెద్ద పెద్ద హోదాల్లో పని చేస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య, డా.కె.వి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డా.కె.వి సుబ్బారెడ్డి, జార్జ్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారలోపం పిల్లలను గుర్తించండి

● వారిని ఎన్‌ఆర్‌సీలో చేర్పించాలి
● సమీక్ష సమావేశంలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో తీవ్రమైన పోషకాహారలోపంతో ఉన్న పిల్లలను గుర్తించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూట్రిషన్ రిహాబిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ)లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గర్భిణులు, చిన్నపిల్లలు, బాలికలకు రక్తహీనత తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సోమవారం నుంచి వయస్సుకు తగిన బరువు, ఎత్తులేని పిల్లలను ప్రతి వారం 32 మంది చొప్పున ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్‌ఆర్‌సీలో చేర్పించడం మొదలు పెట్టాలని ఆదేశించారు. వీరిని 12 రోజుల పాటు ఎన్‌ఆర్‌సీలో ఉంచి, పోషకాహారలోపాన్ని సరిదిద్ది ఇళ్లకు పంపాలన్నారు. పిల్లతో పాటు తల్లులకు కూడా భోజన వసతి కల్పించాలని చెప్పారు. అలాగే 10 నుంచి 19 ఏళ్ల బాలికల స్క్రీనింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసి సెక్రటరేటియట్ వారీగా వివరాలను సేకరించాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ హేమలతను ఆదేశించారు. అదేవిధంగా తీవ్రమైన రక్తహీనత లోపం ఉన్న గర్భిణులను గుర్తించి ప్రసవానికి వారం ముందే ఆసుపత్రుల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీబీ ఇంటింటి సర్వేలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 54 కేసులు నమోదయ్యాయని, వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందించడంతోపాటు 14 మందికి పునర్నిర్మాణ సర్జరీలను చేయిస్తున్నట్లు జిల్లా టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఆర్‌కె. కుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాంజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

కరోనా ఫోర్త్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ వైద్యులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కోవిడ్ ఆసుపత్రులుగా ఎంపిక చేసిన వాటిలో అప్పటి మాదిరిగానే తగినన్ని బెడ్లు, ఆక్సిజన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం జిల్లాలోని ప్రైవేటు బ్లడ్‌బ్యాంకుల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రైవేటు బ్లడ్‌బ్యాంకు వారు రక్తం సేకరించే సమయంలో కచ్చితంగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, వారు నిర్వహించిన క్యాంపులలో సేకరించిన రక్తంలో 30శాతం ప్రభుత్వ రక్తనిధికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని తన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఆయన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు.

ప్రతి పేదింట్లో ఆనందమే లక్ష్యం

● 'గడప గడప'లో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రతి పేదింట్లో ఆనందం నింపాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. మంగళవారం రాత్రి 8వ వార్డులోని 20వ సచివాలయం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపడఖానా కాలనీలో ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు, జమ చేసిన నగదును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పథకాల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఇంటి వద్దకు వచ్చే వలంటీర్‌కు సమాచారం ఇస్తే చాలన్నారు. ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన అందించాలనే ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కాగా గడప గడపలో స్థానికులు చెప్పిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా సభ్యుడు అబ్రార్, పార్టీ నాయకులు షాకీర్, ఫరూఖ్, యూసుఫ్, బాసిత్, శ్రీను, ముస్తాక్, హుసేన్, మున్సిపల్ డీఈ గోపాలకృష్ణ, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరెడ్డి, ఏఈ రాచయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దపడఖానా కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

బీసీ హక్కుల పోరాట సమితిని బలోపేతం చేద్దాం

కర్నూలు(అర్బన్): జిల్లాలో బీసీ హక్కుల పోరాట సమితిని బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని సమితి రాష్ట్ర అధ్యక్షులు జీ అయ్యన్నయాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ధనుంజయ ఆచారి పిలుపునిచ్చారు. మంగళవారం సావిత్రీబాయి పూలే 191వ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో పోరాట సమితి జిల్లా అధ్యక్షులుగా జీ రమేష్‌యాదవ్‌ను ఎన్నుకొని నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తూచ తప్పకుండా నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్‌యాదవ్‌కు నియామకపత్రం అందిస్తున్న రాష్ట్ర నేతలు

ఆర్‌యూ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో నెలకొన్న అంతర్గత సమస్యలను ప్రభు త్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ. శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ..వర్సిటీపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాక ఆత్మహత్య లు చేసుకోవడం వరకూ వెళ్తున్నారన్నారు. వీసీగా ఆనందరావు పదవిబాధ్యతలు చేపట్టిన తరువాత సమస్యలు పెరుగూ పోతు న్నాయే తప్పా తగ్గడంలేదన్నారు. ఎవరైనా సమస్యలు చెప్పితే వారిని నిర్లక్ష్యంగా వర్సి టీ నుంచి బయటకు పంపుతున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో భోజనం బాగుండడంలేదని, ఎవరైనా ప్రశ్నిస్తే ఇంటికి పంపుతారనన్న భయంతో విద్యార్థులు వారు పెట్టిందే తిని అనారోగ్యంపాలవుతున్నారన్నారు. పరీక్షల విభాగం, సీడీసీ, అకడమిక్ వ్యవహారాల్లో ఎక్కువగా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు విజయేంద్ర, షాబీర్, రంగస్వామి, శరత్ కుమార్, థామస్ పాల్గొన్నారు.

ఏపీటీడబ్ల్యూటీఏ డైరీ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం(ఏపీటీడబ్ల్యూటీఏ) ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో ముద్రించిన 2023 సంవత్సరం డైరీ, క్యాలెండర్లను జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్ శ్రీనివాసకుమార్ ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యు.వీరన్న, ప్రధాన కార్యదర్శి ఎం.రామనాయుడు, హెచ్‌డబ్ల్యూఓ ఓబులేసు, ప్రధానోపాధ్యాయులు శివక్రిష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గిరిజన ఆశ్రమ, గురుకులాల్లో 10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి చదివించాలని, సీ, డీ గ్రేడ్ల విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసకుమార్

అనుమతి లేని షాపులు తొలగించే యత్నం

● వాగ్వాదానికి దిగిన స్థానికులు

కర్నూలు (టౌన్): నగరంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న యూకాన్ ప్లాజాలో నిబంధనలకు విరుద్ధంగా షాపులను ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై ఏడాది క్రితం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే అప్పట్లో తొలగించే ప్రయత్నం చేసినా అడ్డుకున్నారు. కొంత సమయం ఇవ్వాలని కోరారు. అనుమతి లేని 14 షాపులకు సంబంధించిన వారిలో కొంత మంది కోర్టును ఆశ్రయించడం, తొలగించాలని మరొకరు కోర్టును ఆశ్రయించారు. బీఆర్ఎస్ (బిల్డింగ్ రెగ్యులైరేజన్) కింద అనుమతి తీసుకోవాలని కోర్టు సూచించింది. అయితే బీఆర్ఎస్ అవకాశం లేకపోవడంతో మంగళవారం టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు దామోదర్, శబరీష్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హరీష్, చైన్ మెన్లు యూకాన్ ప్లాజా కాంప్లెక్స్‌కు చేరుకొని నోటీసుల ప్రకారం తొలగించే ప్రయత్నం చేశారు. అయితే షాపుదారులు తీవ్రంగా అడ్డుకున్నారు. ఒక దశలో కిరోసిన్ తీసుకొని వాగ్వాదానికి దిగడంతో కొంత సేపు నిలిపి వేశారు. సర్దిచెప్పిన టౌన్ ప్లానింగ్ సిబ్బందికి స్థానికులు ఒక రోజు గడువు కావాలని విన్నవించారు. దీంతో తొలగించే పనులు నిలిపి వేసి అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా కాంప్లెక్స్‌లలో ఇష్టానుసారంగా షాపులు వేసుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇప్పటికే వారందరికి నోటీసులు జారీ చేశామన్నారు. అన్ని షాపులను తొలగిస్తామని చెప్పారు.

రాయలసీమ హక్కులు నెరవేర్చండి

కర్నూలు కల్చరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజును రాయలసీమ ఉద్యమ కారులు మంగళవారం కలిశారు. ఈ నెల 8వ తేదీన కర్నూలుకు రానున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో రాయలసీమ హక్కులను నెరవేర్చే హామీలను ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. తెలంగాణ, రాయలసీమలో ఏర్పాటు కాబోతు న్న ఐకానిక్ వంతెనను బ్రిడ్జ్ కం బ్యారేజ్‌గా మార్చాలని, బీజేపీ ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, కేఆర్ఎంబీని రాయలసీమలో ఏర్పాటు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని తదితర డిమాండ్ల నెరవేర్చాలని విన్నవించారు. కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమ నాయకులు రవికుమార్, అశోక్, లాజరస్, రంగముని నాయుడు, వీవీ నాయుడు, సురేంద్రారెడ్డి ఉన్నారు.

నేటి సమాచారం

32వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డు 81వ వార్డు సచివాలయం పరిధిలోని గంగావతి నగర్, ముజఫర్‌నగర్ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరుకానున్నారు. కావున కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గఫూర్ పార్కులో పెన్షన్ వారోత్సవాలు:

అమ్మ ఆస్పత్రి సమీపంలోని గఫూర్ పార్కులో బుధవారం పెన్షన్ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కల్లూరు అర్బన్ పరిధిలోని 19, 20, 21 వార్డుల్లో కొత్తగా పెన్షన్లు మంజూరైన వారికి పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

కర్నూలు(సెంట్రల్): కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం నగర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చాక పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న 44 లేబర్ చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రహిమాన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలి

కర్నూలు(సెంట్రల్): జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే ఐద్వా 13వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అలివేలు పిలుపునిచ్చారు. మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఇందిరాగాంధీ నగర్‌లో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో ఐద్వా ద్వారా మహిళల సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేఎస్ పద్మ, సావిత్రి, ఝాన్సీ, అయ్యమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.